

# తిరుగుబాటు

సొదుం జయరాం

ఉన్నట్టుండి నాగభూషణం తన మంచి తనానికి మచ్చ తెచ్చుకుంటాడని ఎవ్వరూ అనుకోలేదు!

చెడ్డవాడనిపించుకోవడం సులభంకానీ మంచి వాడనిపించుకోవడం మాటలు కాదు. ఇన్నాళ్ళూ వాడు చేసినవన్నీ మంచిపనులే. మచ్చు కొక్కటన్నా చెడ్డపని చెయ్యలేదు!

భూషణానికి ఐదేళ్ళుండగా, పలకా బలపం చేతికిచ్చి వాళ్ళనాన్న, "బడికెళ్ళరా నాయనా" అన్నాడు. వాడు తలూపి, పలకా బలపం పుచ్చుకొని బడికెళ్ళేడు. జ్వరమో, పులకరమో వస్తే తప్ప వాడు బడికి ఎగనామం పెట్టలేదు. బుద్ధిగా చదువుకున్నాడు. తుంటరి పిల్లలతో తిరగలేదు. తుంటబీడీలు కాల్చలేదు. కొంటె పనులు చేయలేదు. పంతుళ్ళు మెచ్చుకున్నారు. ఊళ్ళోవాళ్ళు, తమ పిల్లలకి నాగభూషణాన్ని ఆదర్శంగా చూపి "వాణ్ని చూసి నేర్చుకోండిరా" అన్నారు!

వాడు అంత బుద్ధిమంతుడు గనుకనే ప్రతిసంవత్సరం పైతరగతికి వెళ్ళగలిగాడు. గీతలేక వాని చదువు ఐదవ తరగతితో ఆగిపోయింది. కాని చదివించియుంటే. ఎమ్మేదాకా ఎక్కడా ఫెయిల్ కాకుండా, పాసయివుండేవాడు. వాడికా గీతలేదు. ఎద్దుముడ్డిపొడుచుకుని బ్రతకమనివుంది. అందుకనే వాళ్ళ నాన్నకి వాణ్ణి చదివించాలన్న బుద్ధిపుట్టలేదు. వానికీ మట్టుకు చదవాలనేవుండేది. ఐదో తరగతి పాసయినాక, "హైస్కూల్లో చేరుతాను" అన్నాడు వాళ్ళనాన్నతో.

"వద్దమ్మా, నాకు రానురాను ఏండ్లు పైబడుతున్నాయి. నువ్వులేకపోతే నేసివ్యవసాయం చేయగలనా? అదీగాక కావలసినంత ఆస్తివుంది. చదువెందుకయ్యా!" అన్నాడు.

అదీ నిజమే. వరదయ్యకి భూషణం తొలి సంతానంకాదు. ముందు నలుగు రాడబిడ్డలున్నారు. ఆడపిల్లలు గనుక-వాళ్లు తనకి ఉపయోగపడలేదు. ఉపయోగపడే కొడుకుని, చదువుకోసమని, వదులుకోడానికి, ఆయనికి మనస్కరించలేదు.

తండ్రిసమాధానం విన్ననాగభూషణంమనసులో ఏం బాధపడ్డాడో మారాం మట్టుకు చెయ్యలేదు.

ఆరోజునుంచే పనిలోకి వంగాడు. చిన్నపనీ, పెద్దపనీ, అన్నీ చేసుకపొయ్యేవాడు. వయసొచ్చి, సేద్యగాడయ్యాక కూడ వాడు స్వతంత్రించి ఒక్కపనీ చెయ్యలేదు. వాళ్ళ నాన్న పని పురమాయించాలి వాడు చెయ్యాలి. ఫలానా చేను, దుక్కిదున్నమ్మా అంటే సరేనని దున్నేవాడు. ఫలానా చేను గొర్రు తోలమంటే, గొర్రు, తోలేవాడు. అట్లా అవి ఏ పని ఎప్పుడు చెయ్యాలో, ఎట్లా చెయ్యాలో, తెలియదా అంటే వాడికి బాగానే తెలుసు. ఆ మాటకొస్తే, వాళ్ళ నాన్నకన్నా కూడ వాడికే బాగా తెలుసు. అయితేనేం వాళ్ళ నాన్న చెప్పింది వాడికి వేదవాక్యం.

పెద్దవాళ్లు ఏం చెప్పినా, ఏం చేసినా, తమ మంచికేనని వాడి విశ్వాసం. అందుకే వాడు ఏది చెయ్యాలన్నా- వాళ్ళ నాన్నని అడగందే చేసేవాడు కాదు, వాడికి ఇరవైవిమిదేళ్ళున్నపుడు-కమ్యూనిజం అన్న పదం విన్నాడు, ఆ పదం వాడున్న వూరికి అప్పుడప్పుడే పాకింది. కమ్యూనిస్టులొచ్చి వూళ్ళల్లో రైతు సంఘాలు, కూలి సంఘాలు యువజన సంఘాలు స్థాపిస్తున్నారు. తనతోటి యువకులంతా చాలామంది సంఘాల్లో చేరుతున్నారు. పత్రికలు తెప్పించడం, సభలు జరపడం, బుర్రకథలు నేర్చుకోవడం - వూరంతా ఏదో హడావిడి. ఏదో మార్పు. ఇదంతా చూస్తుంటే భూషణంలో వున్న వుడుకు రక్తంకూడ వురకలు వేసింది. కాని వాళ్ళ నాన్నకది సమ్మతంకాలేదు. "ఛీఛీ, కమ్యూనిష్టుల్లో కలుస్తార్రా ఎవరన్నా? ముసలాళ్ళని గొంతులు కోస్తారువాళ్లు అయినా పనీపాటా లేని ఆకతాయి వెధవలకు పార్టీలుగానీ, మనకెందుకయ్యా?" అని చీదరించుకున్నాడు.

ఆపైన భూషణం నోరెత్తలేదు. అంత బుద్ధిమంతుడు వాడు! అంతెందుకు పక్క టౌనోవున్న సినిమాచూడాలన్నా, వాడు తండ్రి పర్మిషన్ లేందే చూచేవాడు కాదు, వాళ్ళ నాన్న పర్మిషన్ ఇస్తే ఇస్తాడు లేకపోతే లేదు.

"ఏం సినిమాలు, పాడు సినిమాలు. ఒక సీతా పాడా. ఏముంది అందులో...లక్షణంగా కూర్చొని భారతమో, రామాయణమో చదువుకోవయ్యా. పుణ్యమూ, పురుషార్థమూను" అంటాడు.

భూషణం భోంచేసి, బుద్ధిగా, భారతమో, రామాయణమో, పట్టుకొని కాసేపు గొంతెత్తి చదివేవాడు. వాడికి అందులో అక్కడొముక్కా, అక్కడొముక్కా అర్థం అయేవి. అర్థమయినా, కాకపోయినా, నిద్ర కళ్ళమీది కొచ్చినంత వరకు చదివి, ఆపైన పడుకునేవాడు.

ఇట్లాంటి భూషణానికి -వాళ్ళ నాన్నపట్ల వాడి కున్న గురుత్వం, కాస్త సడలింది. ఎప్పుడూ అంటే-వాడి పెళ్ళి విషయంలో. అప్పటికి వాడికి ఇరవై రెండేళ్ళు ఇంటికొచ్చిన బంధువు ఎవరో ఒకాయన, మాట ప్రస్తావనగా, అబ్బాయికి పెళ్ళి సంబంధాలేమీ చూడటం లేదా? అన్నాడు. అప్పుడుభూషణం అక్కడే ఉన్నాడు.

"అప్పుడే ఏం తొందరొచ్చిందిపెద్దా" అంటూ కొట్టి పారవేశాడు వరదయ్య. అది భూషణానికి నచ్చలేదు. పట్టుకారుకు వట్టందని శరీరష్టి తనది. తొందర లేక పోవడమేమిటి? సేద్యంకాడికి ఇంకా, తల్లో, చెల్లెలో, బువ్వ నెత్తిన పెట్టుకొని రావడం, తల కొట్టినట్లుగా వుంది వాడికి. ఈ విషయం తండ్రి గ్రహించనందుకు, నిజంగానే కోపం వచ్చింది. సమయానికి అక్కడే వున్న అమ్మ చక్రం అడ్డువేసి రక్షించింది.

"ఆయన మాటలకే మెచ్చెలే. ఆడపిల్లలేమో అంతా అత్తగారిళ్ళకు పొయ్యారు. ఒకదాన్నైనా

ళ్లని ఈడను యీ సంసారాన్ని. ఎక్కడన్నా మంచి సంబంధముంటే చూ దన్నయ్యా చేసుకుంటాము" అన్నది అమ్మ.

ఆ క్షణాన వాడికి వాళ్ళమ్మ చంద్రుడికన్నా చల్లగా కన్పించింది. వాళ్ళ నాన్నమీద మట్టుకు అంతులేని ఆగ్రహం గలిగింది. ఆ ఆగ్రహాన్ని అప్పుడు చూపితే బాగుండదని మరునటిరోజు పెళ్ళ గ్రక్కేడు.

ఎవరో ఎడ్లబేరగాళ్ళొస్తే, అందని బేరంచెప్పి అడలగొట్టి పంపాడు.

"ఏకాదికో ఒకకాదికి దాన్ని యీడ్చిపారెయ్యక ఇంకా అట్టేపెట్టుకోవడం యెందుకు?" అన్నాడు భూషణం రుస రుసలాడుతూ.

"ఏకాదికో ఒకకాదికి యీడ్చడానికి అదేం ముసలదా ముతకదా? నేతది పదేళ్లు చేస్తుంది. ఉండనీ ఏం నష్టం" అన్నాడు వరదయ్య.

"నేతది! ఇంకా పాల పళ్ళలోనే వుంది." అంటూ వెటకారం చేశాడు భూషణం.

వరదయ్య ఎన్నడూ యీ అనుభవాన్నెరగడు. సిపాయిల తిరుగుబాటు బ్రిటిషువాళ్ళకి కల్గించినంత ఆందోళన కల్గించింది ఆయనకు. తిరుగుబాటుకు బీజం పడిందంటే ఎవరికైనా భయమేమరి.

ఎట్లాగయితేనేం ఆ తర్వాత భూషణానికి సంబంధం ఒకటి వచ్చింది. పిల్లని చూడటానికి భూషణం వెళ్తుండగా, వరదయ్య చెప్పేడు. "పిల్ల కాస్త నలుపని విన్నాను. అయినా, వంశం, సాంప్రదాయం, మంచి వంటున్నారు. చూచి ఆలోచిద్దాం" అని.

చూడటానికేముంది. వాళ్ళ నాన్న చెప్పినట్టు పిల్ల నలుపే. ఒప్పుకోనడమా, మానడమా, అన్న విషయంలో మీమాంస బయలుదేరింది. కాని తడకు వాళ్ళనాన్న చెప్పిన వంశం, సాంప్రదాయం విషయం ఆలోచించి, "ఏరా భూషణం" అని వాళ్ళ నాన్న అంటే, 'ఏయిష్టం' అని అంగీకారంతెల్పాడు. అంగీకారం తెల్పి, ఇక తన పెళ్ళి అయినట్టే అను కున్నాడు. అయితే ఆ సంబంధం ఎగిరిపోయింది!

దాం తర్వాత మరొకటీ, మరొకటీ కూడ ఎగిరి పోయ్యాయి. ఎగిరిపోవడానికి కారణాలున్నవి. నలుపు రంగులో వున్న అమ్మాయీ, మంచి వంశం, సాంప్రదాయం, పదివేల కట్నం - అన్నీ కలగాపులగంగా కలసి. ఒక్కచోట వున్న స్థలం దొరక్కపోవడమే దానికి కారణం. పిల్ల అందంగా వున్న సంబంధాలు వచ్చాయికాని - అంత కట్న మివ్వలేమన్నారు. సాంప్రదాయం సంగతి ఎలా వన్నా సరిపెట్టుకోవచ్చు. మరీ అనాకారి పిల్లలున్న వాళ్లు కూడ అంత కట్నానికి తూగలేకపొయ్యారు. ఈ తిరకాసుల మూలాన, భూషణం పెళ్ళి మరో రెండేళ్ళు వాయిదా పడ్డది. తడకి తన పెళ్ళి వినాయకుడి పెళ్ళి ఎక్కడవుతుందోనని వాడికి భయం పట్టుకుంది. దానికితోడు వాళ్ళూ వీళ్ళూ అదే భయంపెట్టారు.

"మదూరు సాతానయ్యా మావాడి పెళ్ళెక్కడ కానిస్తాడన్న సామెతగా, మీ నాన్న నీ పెళ్ళెక్కడ చేస్తాడులే" అన్నది అలివేలు ఒకరోజు గడ్డికొచ్చి.

ఈ ఎగతాళికి భూషణానికి వళ్ళు మండింది. ఎదుటివాళ్ళు వేలెత్తి చూపితే ఎవరికైనా మంటగానే వుంటుంది.

"మీనాన్న నీ పెళ్ళి చేసేసరికి మా నాన్న నా పెళ్ళి చెయ్యకపోడులే అలివేలూ" అన్నాడు భూషణం.

అనడమయితే అన్నాడు గానీ, తీరా అలివేలు ముఖం చూశాక, ఎందుకన్నానా అని నొచ్చు కున్నాడు. ఎంతయినా ఆడపిల్ల, అందులోనూ పదేళ్ళ నుంచి ప్రయత్నిస్తున్నా - పెళ్ళి కలసిరాని కన్నెపిల్ల. పాపం భూషణం ఎదురుదెబ్బకి అలి వేలు గిలగిల లాడింది. దాని కళ్ళల్లో నీళ్లు తిర గడమొక్కటే తక్కువ.

"నా పెళ్ళికి, నీ పెళ్ళికి పొంతనేమిటి బావా, మీరు కలిగినోళ్లు, మేము పేదోళ్ళం" అన్నది అలివేలు తగ్గి.

అలివేలు బావా అని వరస కలిపేసరికి భూషణం కరగిపొయ్యేడు.

"తమాషా కన్నానులే అలివేలూ - దేనికైనా కలసిరావాలిగా" అన్నాడు.

"దబ్బాళ కాస్త వదలుకుంటే దానంతటదే కలి

ఇద్దరు తాగుబోతులు జైలునించి పారి పోయి, ఒక విమానంలోఎక్కి పైకి ఎగిరి పోయారు. కొంతసేపయ్యాక విమానాన్ని నడిపేవాడు "నాకిక్కడ బాగులేదురా! వెళ్ళి పోతాను" అన్నాడు.

"గాలిగుమ్మటం (పారాచూట్) వేసుకు దూకవోయ్ బయట వాన కురుస్తుందేమో" అన్నాడు రెండోవాడు.

సొస్తుంది" అన్నది అలివేలు. తన పెళ్ళికి అత్యం తరంగా వున్నది, వాళ్ళ నాన్న దబ్బు రంధేనని వాడు ఇంతవరకూ వూహించలేదు అలివేలు అంటూంటే, నిజమేనేమో నన్న ఆలోచన వచ్చింది వాడికి మొదటిసారిగా. వాళ్ళ నాన్న చేస్తున్న పెళ్ళి ప్రయత్నాలమీద జుగుప్స పట్టు కొచ్చింది. ఆలోచిస్తూ నిలబడ్డాడు.

అలివేలు, గడ్డిగంపకు పెట్టి, పైట నెత్తికి చుట్టగా చుట్టుకొని,

'గంపెత్తు బావా వేసు పోతాను" అన్నది.

భూషణం ఆలోచనల్నుంచి తేరుకొని, వచ్చి, గంపెత్తడానికి సాయం పట్టేడు. అలివేలు గంప కింద తలదూర్చబోతే, పైటచుట్ట జారి కింద పడ్డది. అలివేలు అమాంతం సిగ్గుపడి, గంప కిందవేసి పైట సర్దుకుంది. ఈ దృశ్యం - భూషణంలో సంచలనం కలగజేసింది. ఆ వక్షోజాల పొంకం, ఆ సిగ్గుపడటం, పైరుగాలి,-అన్నీ కలసి, భూష ణాన్ని మరోప్రపంచం పొలిమేరల్లోకి ఈడ్చుక పోయాయి.

రాత్రి పడుకుంటే వాడికి నిద్రపట్టలేదు. మాటి మాటికీ మరోప్రపంచం పిలుపే వినిపిస్తోంది. ఆ పిలుపుతో కునుకురాక అల్లాడి పొయ్యాడు.

చిత్రం, వాడికి ఇక ఈ ప్రపంచం కళ్ళకి ఆనలేదు. మరుసటి రోజు అలివేలు మళ్ళా తా పిల్లింది. మునిమాపువేళ వాడు బండి తోలుకొస్తు న్నాడు. అలివేలు గడ్డిగంప తెచ్చి బండ్లో వేసింది. భూషణం బండాపి "ఎక్కు" అన్నాడు.

"ఎందుకులే నడుస్తాను" అన్నది అలివేలు.

"నా ఎడ్లకు నువ్వు బరువుకావులే ఎక్కు" అన్నాడు.

అలివేలు కాస్త తటపటాయించి బండెక్కింది. బాగా చీకటి పడింది. జన సంచారంకూడా అట్టే లేదు. పగ్గాలు సీటుకి చుట్టి, భూషణమూ వచ్చి అలివేలుకు ఎదురుగా బండ్లో నిలబడ్డాడు, వాడికి అలివేలుతో చాలా విషయాలు మాట్లాడాలని వుంది. కాని ఏంమాట్లాడటానికీ చేతకాలేదు. అయితే వాడి నోటికిలేని ధైర్యం కాలికి వచ్చింది. ఎదురుగా జోళ్లు కానుకొని నిలబడ్డ అలివేలు పాదంమీద భూషణం కాలు వేశాడు. అలివేలు అభ్యంతరం చెప్పలేదు. అది అసరాగా తీసుకొని, అరవి కాలి వేళ్ళ కళ్ళు న్నట్టు, అలా అలా పాకి వెళ్ళి అలివేలుపిక్కల మీద పిచ్చిగీతలు గీయడం మొదలు పెట్టేనయ్.

పిచ్చిగీతలు పెట్టే పులకింతలకు తాళలేక, "ఛీ ఏందిబావా నువ్వు మరీను" అని అలివేలు సంద లించి దూరం జరిగింది.

దీనికి ఆ మందలింపుతో వాడు ధైర్యం పుంజుకున్నాడు, ధైర్యం పుంజుకుని, రంగంలోకి దిగాలనుకొనే సరికి ఎడ్లు ఊరి ముందు కొచ్చాయి. అలివేలు బండిదిగి గంప దింపమంది. వాడు గంప దింపి గుటకలు మింగేడు.

సరే ఆ రాత్రి వాడి వూహల్లో మరో ప్రపంచం మళ్ళీ కనుపించి, కళ్ళకి కూడకులేకుండా చేసింది. కూర్చొని మరోప్రపంచం ఆక్రమించుకోవడానికి కావలసిన కార్యక్రమం నిర్ణయించుకున్నాడు.

భూషణం మరుసటిరోజు, చేలగట్లన గడ్డికోసు కుంటున్న అలివేలును వెతుకుంటూ వెళ్ళి, "అలి వేలూ, మీ నాన్న నీకు పెళ్ళిచెయ్యలేడు. మానాన్న ఇప్పుడప్పుడే నాకు పెళ్ళిచెయ్యడు. కాబట్టి మనిద్దరం పెళ్ళిచేసుకుంటే ఎలావుంటుంది? బాగుండదా?" అన్నాడు.

అలివేలు మొదట నమ్మలేనట్టు చూసింది. భూషణం ముఖం చూశాక నమ్మాలనిపించింది. దాంతో అలివేలు ముఖం, పచ్చని పైరులా కలకల లాడింది.

"మీ నాన్న ఒప్పుకుంటాడా మరి?" అన్నది అలివేలు.

"ఒప్పుకోక ఏం చేస్తాడు ఒప్పిస్తాను" అన్నాడు భూషణం.

వాడి మాటల్లో అలివేలుకు నూటికి మూడు పాళ్ళు నమ్మకం చిక్కింది. నమ్మింది గనకనే భూషణం పిలిస్తే విప్పంకోచంగా, వాడి వెంట జొన్న చేలోకి వెళ్ళింది.

వాళ్ళు జొన్నచేను వదలి ఇవతలికి వచ్చేసరికి చీకటి పడింది. ప్రపంచమూ జ్ఞాపకం వచ్చింది. "చీకటిపడింది. ఈ కాస్త గడ్డి గంపలో వేసుకొని ఎట్లా ఇంటికి వెళ్ళడం?" అన్నాడు భూషణం.

అలివేలుకు ఆ పాలెగాణ్ని చూస్తే జాలివేసింది. తను కోపించింది, భూషణం కోపించేడు. అంతా కలిసి

భూషణం గంపను పెట్టి "తీసుకపో" అంది.

"మరి నీకో?" భూషణం ప్రశ్నించేడు.

"నాకో నీకెందుకు. నువ్వు తీసుకెళ్ళు" అన్నది అలివేలు.

అలివేలు చేస్తున్న త్యాగానికి భూషణం ముగ్ధుడయ్యేడు. గంప నెత్తికెత్తుకొని ఇంటికొచ్చాడు. ఇంటికొచ్చి, స్నానం చేసి, భోంచేస్తుండగా, భూషణం తల్లి మాటల ప్రస్తావనలో అన్నది "అలివేలు ఇవ్వాళ గడ్డికోసి కోసి కట్టిందట పాపం. వట్టిగంపతో కుంటుకొంటూ యింటి కొచ్చింది" అని.

భోంచేస్తున్న భూషణం ఆశ్చర్యంతో నోరు తెరిచేడు.

మరుసటిరోజు భూషణం, తండ్రి యెదుటపడి, కుండ బద్దలుకొట్టినట్టు "నాన్నా నేను అలివేలును చేసుకుంటాను. కట్నం మీరేమీ అడక్కండి. వాళ్ళు ఇచ్చినంతా తీసుకోండి. ఇవ్వాళే అయిన వాళ్ళు నలుగురినీ పిలిచి నిశ్చయ తాంబూలాలు పుచ్చుకోండి" అంటూ ఆదేశించాడు.

వరదయ్యకు, అది కలో, వైష్ణవ మాయో, అంతుచిక్కలేదు. ఇండియా అణ్వాస్త్ర ప్రయోగం జరిపినా, ప్రపంచానికి కంత ఆశ్చర్యం కలగదు! ఆయన అంతటి ఆశ్చర్యంనుంచి తేరుకొని "నా ఆస్తిలో చిల్లిగవ్వ నీకు ముట్టదు. చిప్ప చేతి కొస్తుంది. ఇది ఖాయం" అన్నాడు వరదయ్య.

"ఆస్తి నీ స్వార్జితం కాదు. ఆ మాట జ్ఞాపకముంచుకో" అన్నాడు భూషణం. దానిపైన మాటా మాటా వచ్చింది. పెద్ద అల్లరి అయ్యేదే, భూషణం తల్లి కలుగజేసుకుంది. "అడ్డాల నాడు బిడ్డలుకాని, గడ్డాలనాడు కాదు. మన మాట వింటారా చేస్తారా? వారిష్టమే జరగనివ్వండి. మాటామాటా అనుకుని అల్లరిపడితే, నలుగురిలో నగుబాటు" అన్నది ఆమె.

ఇట్లా నర్ది చెప్పడంలో, ఆమె స్వార్థమూ కొంత వుంది. ఎన్నాళ్ళు ఎదురు చూచినా, కోడలు రాకా, బండెడు సంసారం ఈదలేకా ఆవిడ అవస్థపడు తోంది.

వరదయ్యకి కడకు ఒప్పుకోక తప్పలేదు. కాని కొడుకుని నానా తిట్లూ తిట్టేడు. భూషణం తిట్లని లెక్కచెయ్యలేదు. వాడే స్వయంగా వెళ్ళి, అయిన వాళ్ళు నలుగురినీ తెచ్చి, ఇంట్లో కూడేశాడు. ఆ పైన అలివేలు తండ్రినీ పిల్చుకొచ్చేడు. అందరూ ఆశ్చర్యంనుంచి తేరుకొని, పెండ్లి పెత్తనం మొదలెట్టేరు. అన్నీ ఒక కొలిక్కి వచ్చేనంతవరకు ఆగిచూచి, సంతృప్తిగా, గడ్డిగంప తీసుకొని, పొలం మీదికి బయలుదేరేడు భూషణం.

"ఏమయ్యో పెళ్ళికొడకా! ఇంట్లో పెళ్ళి ఖాయ పెడుతూవుంటే, ఇక్కడికొచ్చావ్?" అన్నది అలివేలు పొలంమీద.

"పెళ్ళికూతు రిక్కడుంటే, అక్కడేమున్నది!" అన్నాడు భూషణం.

"ధూత్ చెడిపొయ్యావు భూషణం బావా!" అన్నది నవ్వాపుకుంటూ అలివేలు.

భూషణం చెడిపొయ్యామా అనలేదు. చెడిపోలేదూ అనలేదు. అలివేలును పట్టుకొని పందిట్లో అదిమి బుగ్గ కొరికేడు.

★

# రత్నాలరాసులు

## హృదయ పరివర్తన

జనరల్ విల్యం బూత్ అను నొక గొప్ప క్రైస్తవ భక్తుడు ఈ విధంగా వ్రాశాడు:

"ఏ తీర్మానములుగాని లేక మతాచారములుగాని, సదాచారములుగల మనోభావములుగాని మానవులను మంచి వారిన్నిగా చేయలేవు. వారు దురాశలనెడి పాపములకు దాసులై యున్నారు. ఎట్టి పరిస్థితులలోను వాటినుండి తప్పించుకొనలేరు. అభిలాష అనునది అభిలాషనే నుద్భవింపజేయును. ఫలితము కారణముకంటే గొప్పగా నుండలేదు. స్వభావాన్ని అభివృద్ధి చేయవలయునని శీలముయొక్క స్వరూపాన్నే మార్చాలి. హృదయమార్పు లేకుండా మానవునిలో మార్పు కలుగు నను టకు ఏ నిరీక్షణ లేదు. ఈ మార్పు చేయువాడు దేవుడే! హీనకరమైన పాపముల నుండి దుర్మార్గులు రక్షణ నొందగలరు. పాపుల రక్షణ దేవునిదై వుంది. వారి నాశనము వారిదై వుంది."

ఈనాడు ప్రపంచంలో మానవులను మంచిగా చేయుటకు ఎన్నో ప్రయత్నములు జరుగుచున్నాయి — ఎన్నో స్కీములు వేస్తున్నారు. కమిటీలు — సబ్‌కమిటీలు — యితర సమావేశములు — వాటి కార్యాలు — తీర్మానాలు — జరుగుతూనే యున్నాయి. కాని మానవునిలో మార్పురావటము లేదు. పుణ్యాలు చేస్తే హృదయంలో మార్పువస్తుందనుకొంటారు. తీరా చేసిం తర్వాత అనుభవించేది శూన్యం. ఏదో పుణ్య ప్రదేశాలు చూస్తే జీవితాలు పరమార్థమగునని తలుస్తారు మరికొందరు. చూచిం తర్వాత లభించేది ఏమిటో - మనస్సుకు తృప్తికాని, ఆత్మకు శాంతిగాని లభించుట లేదు.

ఈ జీవిత పరమార్థం అనుభవింపలేని యొక వ్యక్తి యేసుక్రీస్తు ప్రభువు నొద్దకు వచ్చాడు. అది రాత్రి సమయం. వెన్నెల తీక్షణంగా ప్రకాశిస్తున్నది. ఆకాశం నిర్మలంగా వుంది. సృష్టి దైవసన్నిధిలో నున్నదేమో నిశ్శబ్దం తాండవిస్తోంది. ఆ వ్యక్తి పేరు నికొదేము. వారిరువురి మధ్య సంభాషణ ఈ రీతిగా వుంది:

"బోధకుడా నీవు దేవుని యొద్దనుండి వచ్చిన బోధకుడవని మే మెరుగుదుము. దేవుడతనికి తోడై యుంటేనేకాని నీవు చేయుచున్న క్రియలను ఎవడును చేయలేడని ఆయనతో చెప్పెను. అందుకు యేసు అతనితో - ఒకడు క్రొత్తగా జన్మించితేనే కాని అతడు దేవుని రాజ్యమును చూడలేడని నీతో నిశ్చయముగా చెప్పుచున్నాననెను. అందుకు నికొదేము — ముసలివాడైన మనుష్యుడేలాగు జన్మింపగలడు? రెండవమారు తల్లి గర్భమందు ప్రవేశించి జన్మింపగలడా అని ఆయనను అడుగగా! యేసు ఇట్లనెను - ఒకడు నీటి మూలముగాను ఆత్మ మూలముగాను జన్మించితేనే గాని దేవుని రాజ్యములో ప్రవేశింపలేడని నీతో నిశ్చయముగా చెప్పుచున్నాను. శరీర మూలముగా జన్మించినది శరీరమును, ఆత్మమూలముగా జన్మించినది ఆత్మయునై యుండి."

ఒక కుటుంబము ఆనందదాయకముగా నుండవలయునన్నిన, నొక సమాజము సమైక్యత కలిగి యుండవలయునన్నిన, నొకదేశము ఔన్నత్య స్థితిలో నుండవలయునన్నిన మానవు హృదయాలలో పరివర్తనము కలుగవలయును. ఈ పరివర్తనము క్రీస్తుప్రభువు కలుగజేయగలడు. నీవు ఈ నూతన అనుభవమును సంపాదించ వలయునని కోరిన, ఈ దినమే మాకు వ్రాయుము. ఆత్మీయకంగా మేము నీకు సహాయము చేసెదము.

రానున్న వారం మీ కోసం మరొక రత్నాలరాశి

— యన్. యల్. విక్టరు


ఉచితం ఉచితం ఉచితం

మీ ఇంట్లో కూర్చుని బైబుల్ పరిశోధనమీద చక్కటి సర్టిఫికేటు పొందాలన్నా బైబుల్‌కి సంబంధించిన అందమైన, విలువగల పుస్తకాలు కావాలన్నా ఒక కారుమీద మీ అడ్రస్‌తో స్పష్టంగా వ్రాయండి. పోస్టు ఖర్చులుకూడా మావే.

ఇదీ అడ్రస్:
ఎస్. జాన్ డేవిడ్
నిరీక్షణ
పోస్టు బాక్సు: 12
చిలకలూరిపేట. గుంటూరు(జిల్లా)

30 th Gospel Message Inserted by
S, John David, Post Box No. 12. Chilakaluripet, Guntur Dt.